క్లుప్తంగా

నేడు అద్దంకిలో గడప గడపకు మన ప్రభుత్వం

అద్దంకి: పట్టణంలోని ఒకటో వార్డులో బుధవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం పూర్వాబాద్ర నక్షత్రం చవితి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆర్బీకేను సందర్శించిన విజిలెన్స్ అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

పర్చూరు: మండలంలోని తిమ్మరాజుపాలెం ఆర్బీకేను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సందర్శించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను, ఉద్యోగుల పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు గురించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ విధానంపై నమోదు చేసిన రెండు పొలాలను పరిశీలించారు. వీరితో పాటు ఏవో రామ్మోహనరెడ్డి, పర్చూరు రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

కారంచేడు: వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ఆమె మండలంలోని యర్రంవారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి, దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో చీరాలకు చెందిన ప్రకాష్ డెంటల్ కేర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ అబ్రహాం వెస్లీ, డాక్టర్ సృజన అబ్రహాం, డాక్టర్ పార్సీ, డాక్టర్ షైనీ, సిబ్బంది కలసి విద్యార్థులకు, గ్రామస్తులకు సుమారు 350 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈవూరి మాధవి, సొసైటీ అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డి, హెచ్‌ఎం మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్సై నాయబ్ రసూల్

చినగంజాం: బాలికల విద్యకు ప్రాధాన్యత నిచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకునేలా వారిని ప్రోత్సహించాలని ఇంకొల్లు ఎస్సై షేక్ నాయబ్ రసూల్ అన్నారు. మంగళవారం బాలికా దినోత్సవం పురస్కరించుకొని అంకమ్మ కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అంజలి, అంగన్‌వాడీ సీడీపీఓ సుచిత్ర, సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, సూపర్ వైజర్ వాణి, మహిళ పోలీస్ అపర్ణ, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ మేరీ జ్యోత్స్న, ఏఎన్‌ఎం ప్రతిభ, ఉపాధ్యాయులు స్నేహలత, అనిత, పద్మ, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

పర్చూరు: తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేస్తూ పర్చూరు సీడీపీవో కార్యాలయం వద్ద ప్రాజెక్ట్‌లో ఉన్న అంగన్ వాడీ కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజబెత్, జిల్లా సీఐటీయూ కార్యదర్శి జీ ప్రతాప్ కుమార్,అంగన్‌వాడీ నాయకురాలు జీ అనిత, క్రీస్తురాజ్యం, దేవమణి పాల్గొన్నారు.

ఆడపిల్లలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం

● ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

కారంచేడు/యద్దనపూడి: గ్రామాల్లోని ఆడపిల్లలను స్వేచ్ఛగా ఎదగనిద్దామని ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ పర్యవేక్షకురాలు హిమబిందు అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కుంకలమర్రు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న లింగవివక్ష, బాల్య వివాహాలు, బాలల హక్కులు, చిన్న వయస్సు నుంచి మంచి బలవర్ధకమైన పౌష్టికాహారం వంటి అనేకమైన విషయాలపై అవగాహన కల్పించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, కారంచేడు, కుంకలమర్రు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు, వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✔ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను, లింగవివక్షతను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యద్దనపూడి ఎంపీడీవో కృష్ణకుమారి సూచించారు. మండల కేంద్రం యద్దనపూడిలో బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికల అభ్యున్నతికి పాటుపడాలని, వారి హక్కులను రక్షించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌కె. మీరాబి, తహసీల్దార్ వెంకటరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పాల్గొన్నారు. యద్దనపూడి బాలికల గురుకుల పాఠశాలలో బాలికా దినోత్సవం సందర్భంగా కంటివెలుగు కార్యక్రమం కింద విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. ప్రమీలా, వైద్యాధికారి వీరబ్రహ్మం, సీహెచ్‌ఓ టీవీఎస్ ప్రసాద్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

✔ బాల్యవివాహాలను ప్రతి ఒక్కరూ పూర్తిగా వ్యతిరేకించాలని కడవకుదురు, చినగంజాం, పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు బీ ప్రసన్న కుమారి, సీహెచ్ పద్మకుమారి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. కేజీబీవీలో భారత్ నిర్మాణ్ వలంటీర్ ఈ గోవిందస్వామి పాల్గొన్నారు.

బాలికా విద్యతో సమాజ చైతన్యం

అద్దంకి: బాలికా విద్యతో సమాజం చైతన్యవంతం అవుతుందని శింగరకొండపాలెం ఎంఎల్‌హెచ్‌వో పద్మావతి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సింగరకొండపాలెంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల పీ జాకబ్, పూర్ణచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైఏ మహిళా డిగ్రీ కాలేజీలో కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు దిశ, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయిస్తే పడే శిక్షలు, చట్టాలపై న్యాయవాది హేమ వివరించారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఆడపిల్లలకు 1600 సైకిళ్లు, 800 కుట్టుమిషన్లు అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఐ.బాబూరావు, పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమణమ్మ, బాలవెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలానే పేరాల ఆంధ్ర రత్న మున్సిపల్ పాఠశాలలో బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి తాడివలస దేవరాజు, పీఎంసీ కమిటి కో–ఆప్షన్ సభ్యుడు మునీర్ ఖాన్‌లు పాల్గొన్నారు. అలానే మండలంలోని రామకృష్ణాపురంలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలికల హక్కులు, బాలికలు సమాజంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్ హైస్కూల్ హెచ్‌ఎం ఈ.విద్యాసాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.ఇందిర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఆడపిల్లలు ముందున్నారు..

అద్దంకి: జాతీయ బాలికా దినోత్సవం సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సీడీపీవో సుధ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్లికురవ: బాలికల చదువు ఇంటికి వెలుగని, చదువుకుని జీవితంలో స్థిరపడే వరకు వివాహాలు చేసుకోవద్దని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బల్లికురవ కేజీబీవీలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె. సరళకుమారి, సూపర్ వైజర్ సూజాత, ఎంఈవో బీ. రాఘవరావు, వైద్యారోగ్యశాఖ సూపర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కడవకుదురులో బహుమతులందిస్తున్న ఉపాధ్యాయులు



యద్దనపూడి: విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి



సింగరకొండపాలెంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



ఏల్చూరులో కేక్ కట్‌చేసి పంచిపెడుతున్న సీడీపీవో



బల్లికురవలో బాలికల దినోత్సవం..

మార్టూరుకు అన్ని హంగులు కల్పిస్తాం

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



షాదీఖానా గురించి ఆమంచితో మాట్లాడుతున్న ముస్లింలు



సాగర్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆమంచి

మార్టూరు: నియోజకవర్గానికి తలమానికమైన మార్టూరుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. తన రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం మార్టూరులో పర్యటించిన ఆయన స్థానికులనుద్దేశించి మాట్లాడారు. విద్యా, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి చెందుతున్న మార్టూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. స్థానిక రామజనార్దన్ కాలనీ నుంచి పాదయాత్రగా బయలు దేరిన ఆమంచి సమస్యలను అడిగి తెలుసుకుంటూ కాలనీ సమీపంలోని సాగు నీటి చెరువును, స్టోరేజ్ ట్యాంకును పరిశీలించి, నీటి నిలువ సామర్థ్యాన్ని గ్రామస్తులకు సాగర్ నీరు పంపిణీ జరుగుతున్న తీరును అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సింగారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు ఆమంచిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్థానిక పాండురంగ స్వామి ఆలయం, గంగమ్మదేవత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీర్ల చావిడి, ముస్లిం కాలనీల్లో పర్యటించిన ఆమంచికి స్వాగతం పలికిన ముస్లింలు వేలాదిగా ముస్లిం జనాభా కలిగిన మార్టూరు గ్రామంలో షాదీఖానా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుపగా షాదీఖానా నిర్మాణానికి త్వరలో ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ నాయకుడు పుట్టా అయ్యప్పస్వామి తమ వార్డులోని డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం గురించి ప్రస్తావించగా త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల ప్రమాదానికి గురైన షేక్ కరిముల్లా, మృతి చెందిన నాయబ్ రసూల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, మాజీ డైరీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, ఏఎంసీ చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్, మాజీ చైర్మన్ జాష్టి వెంకట నారాయణ బాబు, ఉప సర్పంచ్ కాకోలు రామారావు, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, బాబునాయక్, రాజా నాయక్, గర్నెపూడి రవిచందర్, కాకోలు వెంకటేశ్వర్లు, సులేమాన్, అడకా గంగయ్య, గడ్డం మస్తాన్‌వలి, గన్నవరపు బుడే, అట్లూరి సుకుందరావు, గొట్టిపాటి ఆనంద్, ప్రేమయ్య, మైలా నాగేశ్వరరావు, నాగండ్ల సుబ్బారావు, నాగండ్ల బోస్, మాజీ జెడ్పీటీసీలు తాటి వెంకటరావు, బండి రామయ్య, వినుకొండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాలకు ప్రయోజనం



మహిళకు సంక్షేమ క్యాలండర్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

● నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

వేటపాలెం: నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పొట్టిసుబ్బయ్యపాలెం మత్స్యకార గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు నాయకులకు పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కరణం వెంటేష్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం ఏర్పాటు సి మాట్లాడారు. అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను తెలిపారు. పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వంద హామీల్లో 99 హామీలు ఇప్పటికే అమలు చేసి చూపించిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసులు, గ్రామ పెద్ద కాపులు కోడూరి రాములు, వాయిల అంజయ్య, వాయిల చిన్నరాములు, కోడూరి అంజయ్య, కోడూరి జయరామ్, పొన్నపూడి విజయరాజు, కోడూరి శ్రీను, కూర్రు పోట్టియ్య, పల్లేకారి శ్రీను, వీ వెంకటేశ్వర్లు, బీ జాలయ్య, ఆవుల శ్రీను, ఆతిన వెంకట్రావు, బీ కోటేశ్వరరావు, గడ్డం శివయ్య, శ్రీరామ్ మూర్తి, మాజీ సర్పంచ్ మున్నంగి అరుణ్‌కుమార్, పృథ్వీ చంద్రమోహన్, బండి కళ్ల నరేష్, కొల్లకల వెంకటేష్, బొడ్డు సుబ్బారావు, మాజీ సర్పంచ్ కట్టా గంగయ్య, ఆవుల కోండలు, జమ్మి ప్రసాద్‌రెడ్డి, కావూరి రమనారెడ్డి, జంగిలి రాముడు, హనుమంతరావు, ధనుంజయ, అంకలరెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



జిల్లా గవర్నర్‌ని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని జిల్లా 3150 గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. క్లబ్ సేవా కార్యక్రమాలపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో వేటపాలెం క్లబ్ మంచి పేరు తెచ్చుకుందన్నారు. రోటరీ క్లబ్ ద్వారా తాగునీటి పథకాలు, 8, 9 తరగతి చదువు కొనే విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కొత్తగా సభ్యులుగా చేరిన విశ్రాంత ఉపాధ్యయుడు బట్టా మోహన్‌రావు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా గవర్నర్‌ని రోటరీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పోవూరి నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు సున్నా నాగేంద్రబాబు, సెక్రటరీ ఖదీర్‌బాషా, రోటేరియన్ గొల్లపూడి సీతారాం, కొత్త వాసు, కారంచేటి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని



కలెక్టర్ చేతుల మీదగా ప్రశంస పత్రం అందుకుంటున్న సాద్విక

జే.పంగులూరు: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో పోస్టర్ ప్రజెంటేషన్ విభాగంలో పోటీలు జరిగాయి. ఈ పోటీలు సోమవారం బాపట్ల ఏబీఎమ్ హైస్కూల్లో జరిగింది. ఈ పోటీల్లో బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సాద్విక ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదగా బాపట్లలో రూ. 10 వేలు నగదు, ప్రశంస పత్రం అందుకున్నారు. విద్యార్థికి గైడుగా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు సుధావనిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్వా రైతులకు విద్యుత్‌పై సబ్సిడీ



మాట్లాడుతున్న ఫిషరీస్ ఏడీ కృష్ణకిషోర్

చినగంజాం: ప్రభుత్వం పది ఎకరాల్లోపు ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని చీరాల మత్స్యశాఖ ఏడీ కృష్ణకిషోర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజుబంగారుపాలెం, మున్నం వారిపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో ఆక్వా జోన్ రీ సర్వే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వాజోన్‌లో అందరూ ఆక్వారైతులు భాగస్వామ్యులు కావాలని, ఆక్వా భూముల సర్వే నంబర్‌లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్, ద్విచక్రవాహనాలు, ఆటోలు, బయో ఫ్లాక్ వంటి పలు సదూపాయాలను ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రాజ్‌కుమార్, గ్రామ సర్పంచ్ దేవరకొండ భూలక్ష్మి,శ్రీనివాసరావు, రాజుబంగారుపాలెం, మున్నం వారిపాలెం సచివాలయాల మత్స్యశాఖ సహాయకులు, వీఆర్వోలు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్స్, కేబుల్ వైర్లు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలు, విద్యుత్ వైర్లు

బల్లికురవ: మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వంగిన పోల్స్, కిందకు జారిన వైర్లను ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం సరిచేశారు. ఈనెల 18న సాక్షిలో విద్యుత్ స్తంభాలతో ఇబ్బందులు అన్న కథనంతో అధికారులు స్పందించారు. ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ రామకృష్ణ కిందకు జారిన సప్లయ్ వైర్లు, ఒరిగిన పోల్స్‌ను పరిశీలించి కొత్త పోల్స్ ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారంతో పీఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

లారీ ఢీ, టీవీ మెకానిక్‌కు గాయాలు

అద్దంకి రూరల్: లారీ ఢీకొనడంతో టీవీ మెకానిక్‌కు గాయాలయ్యాయి. ఈఘటన మంగళవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని మౌలానగర్‌లో నివాసం ఉంటున్న షేక్ రంజాన్ స్థానిక భవాని సెంటర్లోని వినాయకుడి గుడి ముందు టీవీ మెకానిక్‌గా షాప్ నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి తిరిగి షాపు వస్తుండగా అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై ఉన్న భవాని సెంటర్ సమీపంలోనికి రాగానే వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అక్రమ బిల్లుతో ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్

చినగంజాం: అనుమతి లేకుండా అక్రమ బిల్లును సృష్టించి ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. ఎస్సై కట్టా అనూక్ వివరాల మేరకు.. కడవకుదురు హైస్కూల్ ఎదురుగా గల ఇసుక క్వారీలో పొట్టి భాస్కర్ అనే వ్యక్తి అనుమతి లేకుండా వేటపాలెం నుంచి కరవది ఇసుక తరలిస్తున్నట్లుగా అక్రమ బిల్లును సృష్టించి టిప్పర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. టిప్పర్‌తో పాటు 20 టన్నుల ఇసుకను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు టిప్పర్ డ్రైవర్, యజమానిని కేసు నమోదు చేసి అదుపులోనికి తీసుకున్నారు. క్వారీ యజమాని భాస్కర్ తప్పించుకున్నట్లు ఇసుకను మైనింగ్ పరిశీలన నిమిత్తం ఉంచినట్ల ఆయన తెలిపారు.

బ్యాంకు మిత్రపై బాధితుల ఆరోపణ

అద్దంకి రూరల్: తాము ఇచ్చిన సొమ్మును బ్యాంకు మిత్ర ఖాతాల్లో వేయలేదని ఆరోపణలు చేస్తూ బ్యాంకు మిత్ర ఇంటికి వెళ్లి మంగళవారం డ్రాక్వా గ్రూపు సభ్యులు నిలదీశారు. గ్రూపు సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకిలోని బంగ్లారోడ్‌లోని ఒక బ్యాంకులో స్థానిక గుర్రాలకాలనిలోని 12 మంది మహిళలు కలిసి గ్రూపుగా ఏర్పడి రూ. 13 లక్షల వరకు రుణం తీసుకున్నారు. గ్రూపు సభ్యులు ప్రతినెలా డబ్బులు కట్టేందుకు బ్యాంకు వచ్చి అక్కడే ఉంటున్న బ్యాంకు మిత్రకు ఇచ్చి కట్టమని వెళ్లేవారు. ఈవిధంగా కట్టిన గ్రూపు సభ్యులు లోను మొత్తం చెల్లించామని మరలా లోన్ తీసుకునేందుకు బ్యాంక్ మేనేజర్‌ను కలవగా ఇంకా రెండు లక్షలు వరకు లోన్ చెల్లించాలని చెప్పాడు. అప్పుడే లోన్ ఇస్తానని చెప్పటంతో ఖంగుతిన్న గ్రూపు సభ్యులు బ్యాంకు మిత్ర ఇంటికి వెళ్లి నిలదీశారు. నేను అంతా చెల్లించాని బుధవారం మేనేజర్‌తో మాట్లాడతానని బ్యాంకు మిత్ర చెప్తోంది.